


www.netifocusnews.com

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు

సోమవారం 11, ఆగస్టు 2025 | పేజీలు: 04


# పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

- రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా అచ్చంపేట ఏరియా హాస్పిటల్లో ఉచిత మెగా సర్జికల్ క్యాంప్
- సర్జరీకి పేరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆపరేషన్ చేస్తాం
- అచ్చంపేట పట్టణంలో విజయవంతంగా మూడో విడత మెగా సర్జికల్ క్యాంపు ప్రారంభం
- రోగులకు కావలసిన వసతులు కల్పిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ





ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్-ఆగస్టు 10:

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో ఉచిత మెగా సర్జికల్ క్యాంపు ప్రముఖ సీనియర్ వైద్యులు జనరల్ సర్జన్, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెగా సర్జికల్ క్యాంపుకు 570 మంది పేర్లు నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మొదటిరోజు మిగతా 2లో..





## కాషాయం గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు సమక్షంలో గువ్వల చేరిక
- అచ్చంపేటలో బిజెపి జెండ రెపరెపలాడాలి
- బిజెపి జిల్లా ముఖ్యనేతలు హాజరు

2వ పేజీలో..



## ఉప్పరగూడెంలో బోనాల మహోత్సవం

- భక్తి, ఉత్సాహాల కలయిక





2వ పేజీలో..

నేటి ఫోకస్ న్యూస్

సోమవారం 11, ఆగస్టు 2025





## కాషాయం గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ ఆగస్టు 10:**

అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిఆర్ఎస్ పార్టీకి గత ఐదు రోజుల క్రితం రాజీనామా చేసి ఆదివారం హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు సమక్షంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాషాయం గూటికి చేరుకున్నారు. ముందుగా బాలరాజుకు రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్రావు కండువా కప్పి భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిజెపి ప్రాథమిక సభ్యత్వాన్ని గువ్వల బాలరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు మాట్లాడుతూ.. గువ్వల బాలరాజు లాంటి యువ నాయకుడు అచ్చంపేట నియోజకవర్గం లో ప్రజలకు ఎన్నో సేవలు అందించే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, విద్యాసంస్థలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల మందనాలు పొందిన వ్యక్తి అని కొనియాడారు. నియోజకవర్గాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో క్రియాశీల పాత్ర పోషిస్తూ ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. గువ్వల బాలరాజు భారతీయ జనతా పార్టీలో చేరడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది అన్నారు. అచ్చంపేట ప్రాంతాన్ని మరింత తన వంతు కృషితో ముందుకు తీసుకొస్తారని అభిప్రాయపడుతున్నామని తెలిపారు. బాలరాజ్ చేరికతో అచ్చంపేట లో బిజెపి జెండా రెపరెపలాడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి





(మొదటిపేజీ తరువాయి..)

వైద్యుల బృందంతో ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు 72 మందికి ఆపరేషన్లు విజయవంతంగా చేయడం జరిగింది అన్నారు. ఈ సర్జకల్ క్యాంపులో డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో కలిసి క్యాంపు ప్రారంభించడం జరిగిందన్నారు. గత రెండు విడుదలలో అచ్చంపేట







ప్రభుత్వ ఏరియా దావఖానలో రెండుసార్లు విజయవంతంగా శాస్త్ర చికిత్సలు, ఆపరేషన్లు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ నియోజకవర్గం పరిసరాల ప్రాంత పేద ప్రజలు, మధ్యతరగతి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరు, సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేసుకోలేని వారికి అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో మెగా సర్జికల్ ఉచిత క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. పేద ప్రజల ఆరోగ్య అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లమల్ల ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఉచితంగా శాస్త్ర చికిత్సలు, రోగానికి సరిపడా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ క్యాంపు నెల చివరి వరకు ఉంటుందన్నారు. నల్లమల్ల ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ మెగా సర్జికల్ క్యాంపును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ ప్రభు, డిప్యూటీ డిఎంహెచ్ఓ తారా సింగ్, వైద్యులు ప్రదీప్ రాజ్, మహేష్, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పరగూడెం బోనాల మహోత్సవం

- **భక్తి, ఉత్సాహాల కలయిక**

**పెద్దవంగర, (ఫోకస్ న్యూస్ ప్రతినిధి/ ఓరుగంటి సైదులు)-ఆగస్టు 10:**

ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాలు కలిసిన బోనాల పండుగ ఉప్పరగూడెం గ్రామాన్ని ఆదివారం ఉత్సవ వాతావరణంలో ముంచెత్తింది. పల్లె వీధులన్నీ డప్పుల ధ్వనులతో, పూల పరిమళాలతో, నైవేద్యాల సువాసనలతో కళకళలాడాయి.

**సాంప్రదాయ వేషధారణలో మహిళల ఊరేగింపు..**

ఉదయం నుంచే మహిళలు పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలను తలపై మోసుకొని గ్రామ వీధుల గుండా ఊరేగారు. సాంప్రదాయ వస్త్రధారణలో, నైవేద్యంతో కూడిన బోనాలను తీసుకొని ముత్యాలమ్మ తల్లివారి ఆలయానికి నడకయాత్ర కొనసాగించారు. శివసత్తులు, శివాలులు డప్పు చప్పుళ్లతో ముందుండగా యువకులు పాటలతో, నృత్యాలతో ఊరేగింపుకు మరింత ఉత్సాహాన్ని తెచ్చారు.

**ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు..**

బోనాలు సమర్పించిన అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి, వర్షాభివృద్ధి కలగాలని, రైతుల పంటలు పండాలని, పశు పక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని తల్లివారిని ప్రార్థించారు. మొక్కులు చెల్లించుకున్న భక్తుల ఆనందం అంతా ఇక్కడి వాతావరణంలో ప్రతిధ్వనించింది.

**భక్తి, ఐక్యతల ప్రతీకగా నిలిచిన వేడుక..**

గ్రామం మొత్తం ఈ రోజు ఒకే కుటుంబంలా ఉత్సవంలో భాగమైంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ పాల్గొని భక్తి ఉత్సాహాలను పంచుకున్నారు. రాత్రి వేళ వీధులు దీపాలతో, పూలతో8 అలంకరించబడి ఉప్పరగూడెం పల్లె అందాల హరివిల్లులా మెరిసింది. ఈ బోనాల పండుగ భక్తి, ఆనందం, ఐక్యతల ప్రతీకగా నిలిచింది.



# యువత ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధిపై దృష్టి నిలపాలి






## -మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

యువత ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధిపై దృష్టి నిలపాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తికి చెందిన పెద్ద ముక్కుల మహేష్ అనే యువకుడు పానగల్ రోడ్డులో ఏర్పాటుచేసిన చికెన్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన అభినందిస్తూ నాణ్యమైన, ఆరోగ్యమైన ఆహారం అందిస్తే ప్రజలు మన్నిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని పదిమందికి ఉపాధి, భవిష్యత్తు కల్పించి ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, ధర్మానాయక్, కంచరవి, సదుర్ల రమేష్, పెద్ద ముక్కుల రవికుమార్, చిట్యాల రాము, కొమ్ము శ్రీనివాస్, ఎంట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నను కాపాడుకోవాలి



## -రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి.

## -ఆత్మకూర్ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా కు చిన్నారెడ్డి ఘన సన్మానం.

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

ప్రపంచానికి అన్నం పెట్టే రైతన్నను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. ఆత్మకూర్ మార్కెట్ చైర్మన్ గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన రహమతుల్లా ను ఆదివారం ఆయన ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కులాలు, మతాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తూ సన్న వడ్లకు క్వింటాల్ కు 500 బోనస్ ఇస్తూ రైతు భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతినిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఆయనకు సూచించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, పెద్దమందడి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, భాస్కర్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# పోలిశెట్టి బాలకృష్ణ కుమార్తె వివాహ వేడుకలో ప్రముఖ నేతలు

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:





వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పోలిశెట్టి బాలకృష్ణ కల్పన ల కుమార్తె ప్రణీత.. సాగర్ ల వివాహ వేడుకకు పలువురు ప్రముఖ నేతలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హైదరాబాద్ లోని మల్కాజ్ గిరి, ఆనంద్ బాగ్ ఎక్స్ రోడ్డు లో గల బృందావన్ గార్డెన్ లో ఆదివారం అత్యంత అంగరంగ వైభవంగా సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఈ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపీ, బిఆర్ఎస్ నేత రావుల చంద్రశేఖర రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులకు కానుకలు అందజేసి ఆశీర్వదించారు. నీతికి, నిజాయితీకి పెట్టింది పేరుగా జర్నలిజంలో అత్యంత విలువలు కలిగిన జర్నలిస్టుగా పోలిశెట్టి బాలకృష్ణ నేటి జర్నలిజంలో ఇంకా మచ్చలేని జర్నలిస్టుగా కొనసాగుతుండడం చాలా అరుదని వారు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన గోనూరు రమేష్, పోచా రవీందర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వంగూరు నరసింహారెడ్డి, దశరథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ జిల్లాలో మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి పర్యటన

## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి చారకొండ వెంకటేష్ (నేటి ఫోకస్ న్యూస్) ఆగస్టు 10:

రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, గనుల శాఖల మంత్రి డాక్టర్ జి. వెంకట్ స్వామి సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం హైదరాబాద్ అజీజ్ నగర్ మంత్రి నివాసం నుండి ఉదయం 9:00 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 11:00 గంటలకు అచ్చంపేట పట్టణానికి చేరుకుంటారని, మంత్రి పర్యటన సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.



# హక్కులను గుర్తించేందుకే ప్రపంచ ఆదివాసి దినోత్సవం







**- ఆదివాసులు విద్యారంగంలో ముందుండాలి...**

**- ప్రతి ఒక్క ఆదివాసి ప్రభుత్వ ఫలాలు అందిపుచ్చుకోవాలి...**

**- పిటిజి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి...**

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ ఆగస్టు 10:

ప్రస్తుత టెక్నాలజీలో ఆదివాసులు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉంటూ అడవివే తమ ప్రపంచంగా జీవిస్తున్న ఆదివాసి హక్కులను గుర్తు చేసేందుకు ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందని మన్ననూర్ పిటిజి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి అన్నారు. ఆదివారం అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవసభలో ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ.... ఆదివాసీలను గుర్తించి



ప్రత్యేక ఆదివాసి దినాన్ని ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఆదివాసులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి చెంచు విద్యకు దూరం కాకుండా కుటుంబంలో అందరూ చదువుకోనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా ఉపాధి అవకాశాలు పొందాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆదివాసి వేషాదరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బోధ నేతల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం

**-రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి**

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:

అనారోగ్యంతో వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా చితికి పోయిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిది వరంగా మారిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల కతీతంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి



ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్నట్లు చెప్పారు. వనపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, ఇతర మండలాలకు చెందిన 99 మందికి 23 లక్షల 81వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ సాగర్, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎండి. నిరంజన్ బాబా, వనపర్తి మండల పార్టీ అధ్యక్షులు నారాయణ, పెద్దమందడి మండల పార్టీ అధ్యక్షులు పెంటయ్య యాదవ్, రాగి వేణు, కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





# 'ఓట్ చోరీ' వెబ్ సైట్ ఆవిష్కరించిన రాహుల్ గాంధీ!

**ఈసీఐకి వ్యతిరేకంగా 'ఓట్ చోరీ' పేరుతో రాహుల్ గాంధీ ప్రచారం**

**డిజిటల్ ఓటర్ల జాబితా విడుదల చేయాలని డిమాండ్**

**ప్రజల మద్దతు కోసం ప్రత్యేక వెబ్‌సైట్, మిస్డ్ కాల్ నంబర్ విడుదల**

**సోమవారం ఈసీఐ కార్యాలయానికి ఇండియా కూటమి ఎంపీల నిరసన ర్యాలీ**

**రాహుల్ ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన ఎన్నికల సంఘం**

**ఇండియా కూటమి ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విందు**

**ఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) లక్ష్యంగా తన విమర్శల దాడిని మరింత తీవ్రతరం చేశారు. డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలన్న తన డిమాండ్‌కు ప్రజల మద్దతు కూడగట్టేందుకు 'ఓట్ చోరీ' పేరుతో నేడు ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, దానిని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ ప్రచారానికి సంబంధించి రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను పంచుకున్నారు. "వోట్ చోరీని బహిర్గతం చేయడం చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. "దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని ఆపేందుకు ప్రారంభించిన ఈ ప్రచారానికి మనస్ఫూర్తిగా మద్దతివ్వండి. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటం" అని ఆయన అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు, పార్టీలు ఓటర్ల జాబితాను తనిఖీ చేసేందుకు వీలుగా ఈసీఐ పారదర్శకంగా వ్యవహరించి డిజిటల్ ఓటర్ల జాబితాను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రచారానికి మద్దతుగా votechori.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 9650003420 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు.

గత 10 ఏళ్ల ఎలక్ట్రానిక్ ఓటర్ల జాబితాను, వాటికి సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను అందించాలని ఆగస్టు 8న బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఈసీఐని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అలా చేయడంలో విఫలమైతే, ఎన్నికల మోసాన్ని ఈసీఐ కప్పిపుచ్చినట్లే అవుతుందని, అది నేరంతో సమానమని ఆయన హెచ్చరించారు.

అయితే, రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం "ఆధారరహితమైనవి"గా కొట్టిపారేసింది. ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని ఈసీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, రేపు సోమవారం నాడు పార్లమెంట్ కాంప్లెక్స్ నుంచి ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ఇండియా కూటమి ఎంపీలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించడానికి రాహుల్ గాంధీ సిద్ధమవుతున్నారు. ఈసీఐ అధికారులతో సమావేశం కోసం కూటమి నేతలు ఇప్పటికే సమయం కోరినట్లు సమాచారం. అదే రోజు రాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇండియా కూటమి ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఐక్యంగా పోరాడేందుకు విపక్షాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి.